www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 24 నవంబర్ 2024
5
వైఎస్ఆర్

ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా కృషి

ప్రజాశక్తి - కడప

జాతీయలోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో ఎక్సైజ్ కేసులు రాజీ అయ్యేలా అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం కడప జిల్లా కోర్టులోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లో ఎక్సైజ్ అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ నెల 14న జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో ఎక్సైజ్ కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ జిల్లా డిస్ట్రిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్, అన్నమయ్య జిల్లా డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

పోలీస్ కోవర్టుల్లో టెన్షన్..టెన్షన్!

పోలీస్ శాఖలో ప్రక్షాళన దిశగా అడుగులు

వైసిపి కోవర్టుల బదిలీలకు సన్నాహాలు

త్వరలో ఉత్తర్వులు వెలువడే అవకాశం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల పోలీస్ శాఖలో ప్రక్షాళన చేయడానికి జిల్లా అధికారులు అడుగులు వేస్తున్నారు, వైసిపి కోవర్ట్‌లుగా పనిచేస్తున్న పోలీసులను బదిలీలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో పోలీసు కోవర్ట్‌ల్లో టెన్షన్ మొదలైంది. ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాలు ప్రతిపక్ష పార్టీ నాయకులకు చేరుతున్నాయనే సందేహంతో పోలీస్ శాఖలో ప్రక్షాళన ప్రారంభమైనట్లు సమాచారం. ముఖ్యంగా వైఎస్ఆర్ కడప జిల్లాలో పోలీస్ శాఖలో తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రతిపక్ష పార్టీ వైసిపి నాయకులకు చేరుతున్నాయనే సందేహం కూటమి ప్రభుత్వ అధిష్టానానికి కలిగిందని తెలియ వచ్చింది. వైఎస్ఆర్ కడప జిల్లాలోని పోలీస్ స్టేషన్లల్లో వైసిపి కోవర్టులున్నారని, వారి ద్వారానే ఉన్నతాధికారులు తీసుకొనే ప్రతి సమాచారాన్ని చేరవేస్తున్నట్లు అధికారులు గమనించారు. దీని వల్ల వైసిపి వారు జాగ్రత్తలు పడుతున్నారని, ఇందుకు నిదర్శనం ఈ మధ్య జరిగిన వర్రా రవీంద్రారెడ్డి తప్పించుకోవడానికి పోలీసుల సహకారం ఉన్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. అలాగే ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పి.ఎ రాఘవరెడ్డి పోలీసులకు దొరకకుండా అజ్ఞాతంలోకి వెళ్ళాడని, ఇప్పటికీ జల్లెడ పట్టి వెతుకుతున్న దొరకకుండా అజ్ఞాతంలో ఉండడానికి కారణం పోలీస్ వేస్తున్న ప్రతి అడుగు వారికి చేరవేస్తున్నారని అధికారులు గుర్తించినట్లు తెలిసింది. అందుబల్లే సిఎం చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనితా, రాష్ట్ర డిఐజిని పిలిపించుకొని వెంటనే వైఎస్ఆర్ కడప జిల్లాలో మొదట వైసిపి కోవర్ట్‌లను గుర్తించి వారి పై వేటు వేసి పూర్తిగా పోలీస్ శాఖను ప్రక్షాళన చేయాలని ఆదేశించినట్లు పోలీస్ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ మేరకు పోలీస్ శాఖ ఉన్నత అధికారులు కోవర్ట్‌లను గుర్తించే పని ప్రారంభమైందని వారిలో ఆందోళన మొదలైంది. త్వరంలోనే వారిపై చర్యలు తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖలో ఎవరిపై వేటు పడుతుందో అన్న భయం మొదలైంది. ఏది ఏమైనప్పటికీ ఒక వారంలోగా ప్రక్షాళన పూర్తి అయ్యేటట్లు జిల్లా అధికారులు అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి గ్రామ, వార్డు వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వార్డు వాలంటీర్లకు సంబంధించి 2 నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు. జాబ్ కార్డు విడుదల చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బలవంతంగా రాజీనామా చేసినటువంటి వాలంటీర్లు అందరిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే వాలంటీర్లను విధులకు తీసుకుని రూ. 10వేలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కానీ ఇప్పుడు చూస్తే ఏరు దాటకమునుపు ఏటి మల్లన్న ఏరు దాటిన తర్వాత బోటి మల్లన్న టైపులో ఉన్నదని పేర్కొన్నారు. ఈ ఆందోళనే నిదర్శనమని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వాలంటరీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు విజయ్, ఉదయ్, వాలంటీర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వాలంటీర్లు

శాసనమండలిలో పలు అంశాలు ప్రస్తావన

- ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

శాసనమండలి సమావేశాలు ప్రభుత్వం పది రోజుల పాటు నిర్వహించిందని, ఇందులో పలు అంశాలు ప్రస్తావించామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రయివేట్ సంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు హెల్త్ కార్డ్స్, ఇంటి స్థలాలు, రుణాలు కావాలనే కోరుకుంటున్నారని, ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. రెండు దశాబ్దాలకు పైగా పంచా యతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల విషయంలో న్యాయ సమస్యలు ఉన్నాయని చెప్పారు. వీటిని పరిష్కరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశామన్నారు. కడప - రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డును 130 కిలో మీటర్లు రూ.2 వేల కోట్లకు పైగా వ్యయంతో గత సంవ త్సరం శంకు స్థాపన చేసిన ఎందుకు పనులు ప్రారంభించలేదని రోడ్లు భవనాల శాఖ మంత్రిని ప్రశ్నించినట్లు పేర్కొ న్నారు. 30 కిలోమీటర్ల వరకు అటవీ ప్రాంతం ఉందని వాటి అనుమతులు రాగానే పనులు చేస్తా మని మంత్రి సమా ధానమిచ్చారని తెలి పారు. వీటితోపాటు ప్రభుత్వ ప్రైయివేట్ ఉపాధ్యాయ, ప్రజా సమస్యలు ప్రస్తావించినట్లు చెప్పారు.

మాట్లాడుతున్న ఎం.వి. రామచంద్రారెడ్డి

దక్షిణ భారతదేశ ఆర్ట్ క్యాంపు మెంటార్‌గా డాక్టర్ కోట మృత్యుంజయ రావు

ప్రజాశక్తి - కడప అర్బన్

ముంబై లోని ప్రతిష్టాత్మకమైన కోకుయో క్యామ్లిన్ ఆర్ట్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న దక్షిణ భారతదేశ పెయింటింగ్ క్యాంపునకు రెండు తెలుగు రాష్ట్రాల తరపున మెంటార్‌గా వైవీయూ లలిత కళా విభాగం అధిపతి డాక్టర్ మృత్యుంజయ రావు ఎంపికయ్యారు. ఈ మేరకు కామ్లిన్ ఫౌండేషన్ నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఈ నెల 25 నుంచి 30 తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో హంపీ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈ క్యాంపు నిర్వహిస్తారు. దక్షిణ భారత దేశంలోని ఉన్న అన్ని ఫైన్ ఆర్ట్స్ కాలేజీల నుంచి ఎంపిక చేయబడిన దాదాపు 80 మంది యువ చిత్రకారులు పాల్గొంటున్నారు. కార్య క్రమం లో మృత్యుంజయ రావు మెంటార్‌గా వ్యవహరిస్తారు. ప్రతిభ కొలమానంగా ఎంపికైన విద్యార్థులను విజయ నగర చిత్ర, భావన నిర్మాణాల శైలిని చిత్రించడం లో మార్గ నిర్దేశనం చేయనున్నారు. కాగా వైవీయూ లలిత కళా విభాగంకి చెందిన బిఎఫ్ ఏ 4వ సంవత్సరం విద్యార్థి డి. ముత్యం ఈ వర్క్ షాప్‌కు ఎంపిక అయ్యాడు. ఈ 80 మంది చిత్రించిన చిత్రాలను ముంబై జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శన చేస్తారు. అమ్ముడుపోయిన చిత్రాల నగదును ఆయా యువ చిత్రకారు లకు క్యామ్లిన్ ఫౌండేషన్ వారు అందజేస్తారు. కాగా డాక్టర్ మృత్యుంజయ రావు ఎంపిక పట్ల యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పుత్త పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథ రెడ్డి, డీన్ కంకణాల గంగయ్య, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ సి.సరిత, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఎం.రామచంద్రారెడ్డి

రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ కనబర్చాలి

ప్రజాశక్తి - కడప

జిల్లా మహిళా, పురుష జట్లకు ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ నెల 5 నుంచి 8 వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని డాక్టర్ ఎం. రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం కడప నగరంలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా, పురుష జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు పాల్గొనడం విశేషం. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకొని జిల్లా జట్ల ఎంపికలను ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. మూడు శాతం రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ ఆర్. వెంకటసుబ్బయ్య, పీడీ సుబ్బన్న, నిత్య ప్రభాకర్, లక్ష్మరాం నాయక్, వర్కింగ్ సెక్రెటరీ టి. శ్రీవాణి, కోచ్ శ్రీధర్, పిడి లక్ష్మి శ్రీనాథ్, లీలావతి పాల్గొన్నారు.

శుక్రవారం డ్రైడే పాటించాలి

- మలేరియా అధికారి మనోరమ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి శుక్రవారం ప్రజలు డ్రైడే పాటించాలని మలేరియా అధికారి మనోరమ చెప్పారు. శనివారం నంది మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చౌటపల్లి గ్రామంలో డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు ప్రాంతాలను సందర్శించారు. జ్వరాలు ఉన్న వారిని పరామర్శించి జ్వరాలు రాకుండా ఉండాలంటే ప్రతి శుక్రవారం ఇంట్లో ఉన్న తొట్టిలు, బానలు, కూలర్స్, టైర్స్ శుభ్రం చేసుకుంటూ ఉండాలని తెలిపారు. దోమ తెరలు వాడాలని, సాయంత్రం పూట వేపాకుతో పొగ వేసుకోవాలని చెప్పారు. నీళ్ల నిలువ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేసుకోవాలని సలహాలు ఇచ్చారు. అలాగే హెల్త్ అసిస్టెంట్స్, ఎఎన్ఎమ్, ఆశావర్కర్స్‌ను మూడు టీమ్స్ ఏర్పాటు చేసి ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేయించారు. జ్వరలక్షణాలు ఉన్న వారికి రక్తపు నమూనాలు సేకరించి రిమ్స్ హాస్పిటల్‌కు పంపారు. కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూఎస్ ఎఇ ముజీర్, పంచాయతీ కార్య దర్శి గంగులయ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ మురళి, శంకర్ రెడ్డి, ఎమ్‌పిహెచ్ఇఒ రామ ప్రతాప్, ఎమ్ పిహెచ్ఇఒ సరోజిని, సి హెచ్ఓ ఎఎన్ఎం సంధ్య, హెల్త్ అసిస్టెంట్ సుబ్బరామయ్య, సుబ్బయ్య, ఆశాలు శకుంతల, వెంకటసుబ్బమ్మ, లక్ష్మి దేవి, భాగ్యమ్మ, గంగా దేవి పాల్గొన్నారు.

లార్వాను పరిశీలిస్తున్న మనోరమ

విద్యార్థులతో ప్రొఫెసర్ దాము, ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, అధ్యాపకులు

రీసెర్చ్ పట్ల విద్యార్థులు ఆకర్షితులు కావాలి

ప్రజాశక్తి - కడప

సైన్స్, రీసెర్చ్ పట్ల విద్యార్థులు ఆకర్షితులు కావాలని యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఏ.జీ. దాము పిలుపునిచ్చారు. ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) కడప రసాయన శాస్త్ర విభాగం వారు డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ స్టార్ స్టేటస్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం విద్యా ర్థులకు యోగివేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎ.జి.దాముచే 'ఫ్లాష్ ఆఫ్ ఇన్స్పిరేషన్-సక్సెస్ ఇన్ సైన్స్' అన్న అంశంపై ప్రత్యేక అతిథిగా హాజరై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు శాస్త్రవేత్తల ఆవిష్కరణల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.రమేష్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి రాజేశ్వరి, అధ్యాపకులు డాక్టర్ సి నాగేశ్వరెడ్డి, కె శ్రీనివాసులు, షాహిన్, డాక్టర్ బి సుధాకర్ రెడ్డి, డాక్టర్ నాగేశ్వర రాజుగారు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, కన్వీనర్

వర్క్‌షాప్‌ను వినియోగించుకోవాలి

- ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్

ప్రజాశక్తి - కడప

భారత ప్రభుత్వం విజ్ఞాన, సాంకేతిక విద్యా మంత్రిత్వ శాఖ- స్టార్ డిబిటి ఆర్థిక సహకారంతో నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి) ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ స్థాయి విద్యార్థులకు ఈ నెల 25,26 తేదీలలో కంప్యూటర్ సైన్సు అంశాలకు సంబంధించిన 'బ్లాక్ చైన్ టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్' అనే అంశంపై విద్యార్థులకు వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఫ్లైయర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగి ంచుకోవాలని కోరారు. నేటి ఆదునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని తరాలూ అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టార్ డి.బి.టి కన్వీనర్ డాక్టర్ వై.సావిత్రి, ప్రోగ్రాం కన్వీనర్ వై.అనిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.మనోహర రెడ్డి, ఉప ప్రధానాచార్యులు డా.ఎం.రమేష్, అకడమిక్ కో- ఆర్డినేటర్ డా. జి.వెంకటసుబ్బయ్య, ఐ క్యు ఎసి కో- ఆర్డినేటర్ డా. బి. రామచంద్ర, కంప్యూటర్ సైన్సు శాఖ అధ్యాపకులు కె.సంపత్ కుమార్ రాజు, బి.రేణుకాదేవి, మహబూబ్ సుభాని, వీరారెడ్డి, గోవర్ధన్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

నేడు తొగటవీర క్షత్రియుల వనభోజనం

ప్రజాశక్తి- కడప అర్బన్

కనుమలోపల్లిలోని 108 శివ లింగాల మహాలింగేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం నిర్వహించే తొగటవీర క్షత్రియుల కార్తీకమాసవనభోజన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తొగటవీర క్షత్రియసంక్షేమ సంఘం నగరశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్యా సుధాకర్, పల్లా నరసింహారావు కోరారు. సంఘం కార్యాలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్, రాష్ట్ర, జిల్లా, నగర సంఘం నాయకులు పాల్గొంటారని తెలిపారు. అతిథుల సందేశం, పవిత్ర వనభోజనం స్వీకరణ తరువాత నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామన్నారు. మహిళలకు, పిల్లలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి టేకూరు సుదర్శన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లా మురళీ కృష్ణయ్య, ఉపాధ్యక్షులు చౌడం సూరిబాబు,బోలిశెట్టి వెంకటస్వామి, డొండ్ల వెంకటరమణ, బొలిశెట్టి వెంకటసుబ్బయ్య, వెలిగండ్ల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సత్య సాయి బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లక్ష్మిరెడ్డి

సత్యసాయిబాబా సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - కడప అర్బన్

భగవాన్ సత్య సాయి బాబా సేవలు మరువలేనివని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ జి.లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. శనివారం సత్య సాయి బాబా 99వ జయంతి సందర్భంగా సత్య సాయి బాబా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి. లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ శ్రీసత్య సాయి సేవ సమితి, సత్య సాయి బాబా ట్రస్ట్ తరపున ఎందరో పేద విద్యార్థులకు విద్యా బోధన చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కుల మతాల కతీతంగా సత్య సాయి బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు వీరభద్రయ, అబ్దుల్ రాయల్ కరీముల్లా, ఓబుల్ రెడ్డి, ఇలియాస్, పుట్ట రంగయ్య, సాయికుమార్, స్వర్ణలత, నాగసుధా, శిల్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుల లక్ష్మమ్మ 33వ వర్ధంతి

ప్రజాశక్తి - కడప అర్బన్

కందుల లక్ష్మమ్మ 33వ వర్ధంతి సందర్భంగా శనివారం కెఎస్ఆర్ఎం కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వరి ఘన నివాళి అర్పించారు. కాలేజీ నాన్ టీచింగ్ సిబ్బందికి వస్త్ర దానం చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఉన్నత ఆశయాలతో స్థాపించిన ఈ విద్యా సంస్థలో ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. వి.రత్నమ్మ మాట్లాడుతూ 2008 లో స్థాపించిన ఈ విద్యా సంస్థ మరింత అభివృద్ధి చెంది ఎంతో మంది విద్యార్థులకు చేయూత నివ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. తర్వాత వృద్ధాశ్రమంలోని వృద్దులకు పండ్లు పంచి పెట్టారు.

వస్త్ర దానం చేస్తున్న కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

అసత్య ప్రచారం మానుకోండి : వైసిపి

ప్రజాశక్తి - కడప

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై అస్యత్య ప్రచారం మానుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదాని గ్రూప్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు ఆంధ్ర ప్రదేశ్ చేసుకొనే లేదన్నారు. కానీ దాన్ని తీసుకొొచ్చి జగన్మోహన్‌రెడ్డికి అంటగట్టే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. నెలకో అద్భుత కల్పనలు తీసుకొొచ్చి అబండాలు వేయడం చంద్రబాబుకు పరిపాటయిందని పేర్కొన్నారు. ప్రజలు విజ్ఞులేనని, అన్ని గమనిస్తున్నారని తెలిపారు. శనివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోబెల్స్ ప్రచారం చేస్తూ ఏడునెలల కాలాన్ని గడిపేశారని ఆరోపించారు. పరిపాలన లో అప్పులు తప్ప ఏమీ లేదు అని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, ఏ ఒక్కటి కచ్చితంగా నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నిటి నుండి తప్పించుకునేందుకే ఇలాంటి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు అన్నీ తాత్కాలికమైన పనులు చేస్తే, జగన్ దూరదృష్టితో పని చేశారని తెలిపారు. అన్నీ అమ్మేయడం, ప్రయివేటీకరణ చేయడం అనే రీతిలో చంద్రబాబు పనిచేస్తున్నారని విమర్శించారు. చెప్పింది మర్చిపోవడం తప్ప చంద్రబాబుకు ఏ విజన్ లేదన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, బిహెచ్ ఇలియాస్, త్యాగరాజు, రామకృష్ణారెడ్డి, శ్రీ రంజన్ రెడ్డి పాల్గొన్నారు.

25న జాతీయ సదస్సు

ప్రజాశక్తి - కడప : సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం అధునాతన మెటీరియల్స్ సంశ్లేషణపై ఈనెల 25న పురుషుల ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత నిపుణులు, పరిశోధకులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. సదస్సును వైవీయూ ఉపకులపతి కె.కృష్ణా రెడ్డి, కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ డాక్టర్.డి.గిరి, కళాశాల ప్రిన్సిపల్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ముఖ్యవక్తలు పాల్గొంటారన్నారు. అధునాతన పదార్థాల పరిశోధనల సామర్థ్యాలను పెంపొందించడానికి పరిశోధకులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణుల మధ్య విజ్ఞాన భాగస్వామ్యం, సహకారం, నెట్‌వర్కింగ్ కోసం ఒక వేదికను అందించడం ఈ సదస్సు లక్ష్యమని కన్వీనర్ డాక్టర్ బి.సుధాకర్ రెడ్డి తెలిపారు.

తిరోగమనం

ప్రజాదృష్టి

జిల్లాకు వచ్చిన అభివృద్ధి ప్రాజెక్టులను, ప్రధాన సంస్థలను కూటమి నాయకత్వం అడ్డుకుంటూ పోతోంది. ఫలితంగా జిల్లాను తిరోగమనం పాల్జేస్తోంది. 2014-19లో కొప్పర్తికి వచ్చిన ఎనిమిది పరిశ్రమలు తరలిపోవడం మొదలు, ఇటీవల ఎంఎస్ఎంఇ తరలింపునకు, కొనసాగింపుగా జిల్లాకు చెందిన ఎపిజిబి వంటి బ్యాంకింగ్ ప్రధాన కార్యాలయాన్ని, సంస్థలను తన్నుకుపోతుండడం పరాకాష్టకు చేరుకుంది. కూటమి సర్కారు కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయకపోగా ఉన్న వాటిని తరలిస్తోంది. కూటమి నాయకత్వ వైఖరి కారణంగా జిల్లా ప్రజానీకం విస్మయాన్ని వ్యక్తం చేస్తోంది. అవకాశం, అదును, అవసరం ఏర్పడినప్పుడు కూటమికి తగిన బుద్ధి చెప్పడానికి నిరీక్షిస్తోంది. జిల్లాలో వైసిపి నాయకత్వం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. జిల్లాలో ఉన్న అరకొర కంపెనీలను, సంస్థల ప్రధాన కార్యాలయాలను తరలిస్తున్నప్పటికీ ఉద్యమానికి సాహసించడం లేదు. ప్రెస్‌మీట్లు, ప్రకటనలతో సరిపెట్టుకుంటోంది. ఫలితంగా జిల్లా అభివృద్ధిని దశాబ్దానికిపైగా వెనుక్కుతీసుకెళ్తోంది. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండల పరిధిలోని రాగికుంట గ్రామ సమీపంలో 470 ఎకరాల్లో రూ.1,000 కోట్లతో ఆదానీ, రిత్విక్ సంస్థలు పంప్డ్ స్టోరేజీ హైడ్రో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు రావడం తెలిసిందే. స్థానిక ప్రజాప్రతినిధికి తమను సంప్రదించకుండా, ముడుపులు ముట్టజెప్పకుండా పనులు చేపట్టడం పట్టలేని ఆగ్రహాన్ని కలిగించింది. సదరు ప్రజాప్రతినిధి కుటుంబీకులు వందలాది మందితో వెళ్లి దండయాత్రకు దిగిన విషయం తెలిసిందే. దండయాత్ర దృశ్యాల్ని ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో హల్‌చల్ గాకుండా నియంత్రించడానికి ప్రయత్నించింది. దేశవ్యాప్తంగా దండయాత్ర ఘటన చర్చనీయాంశంగా మారింది. జిల్లాకు చెందిన రిత్విక్ కంపెనీ, కేంద్ర పాలకుల అండదండలు పుష్కలంగా కలిగిన అదానీ కంపెనీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లింది. రాష్ట్రంలో కూటమి తరుపున బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన గెలిచిన స్థానిక ప్రజాప్రతినిధి, స్థానికుడైన పార్లమెంట్ సభ్యులు ఉత్తర కోస్తా నుంచి బిజెపి తరుపున గెలిచిన పార్లమెంట్ సభ్యులు ఇద్దరూ బిజెపి నాయకులే. ఇది జిల్లా ప్రజానీకానికి శాపంగా మారింది. ముఖ్యమంత్రి దృష్టికి రిత్విక్, అదానీ గ్రూపు ప్రతినిధులు తీసుకెళ్లినప్పటికీ కేసు, ప్రాజెక్టు పనుల్లోనూ ఎటువంటి పురోగతి లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఫ్యాక్షన్ మనస్తత్వం కలిగిన నాయకులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైతే ఇటువంటి పరిస్థితులు నెలకొంటాయని చెప్పడానికి ఇది ఒక మచ్చుతునక. 2014-19 టిడిపి హయాంలో కర్నూలు జిల్లాకు చెందిన వెలిగొండ ప్రాజెక్టు పనుల బిల్లుల చెల్లింపు విషయంలో అప్పటి ఇరిగేషన్ మంత్రి వర్సెస్ సదరు జిల్లాకు చెందిన టిడిపి నాయకుని సంస్థ మధ్య పేచీ వచ్చింది. బిల్లుల చెల్లింపులను సదరు మంత్రి నిలిపేయడం చర్చ నీయాంశంగా మారింది. జిల్లాకు చెందిన ఇద్దరు టిడిపి ప్రజాప్రతినిధుల మధ్య గండికోట, తాడిపత్రి రహదారి పనుల కాంట్రాక్టు పనుల విషయంలో పేచీ వచ్చింది. సదరు రెండు సమస్యలకు రాష్ట్ర పాలకుడే సాక్షాత్తూ మధ్యవర్తిగా మారి పైసల పంపకాలు చేయడం జుగుప్సను కలిగించింది. ఏతావాతా చెప్పేది ఏమిటంటే నీకు ఇంత నాకు ఇంత అనే దోపిడీ స్వామ్యం యథేచ్ఛగా సాగిపోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మారింది.

- ప్రజాశక్తి-కడప ప్రతినిధి

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -పులివెందుల టౌన్ : పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం తన నివాసంలో పులివెందుల నియోజకవర్గంలోని కాంపల్లి గ్రామానికి చెందిన ఇసుకపల్లి వర్షిని రెడ్డికి రూ.8,34,000, బూచుపల్లి గ్రామానికి చెందిన మార్తల లక్ష్మీదేవికరి రూ. 1,00,000, అగడూరు గ్రామానికి చెందిన సారెడ్డి గంగిరెడ్డికి రూ. 62,038, సుంకేసుల గ్రామానికి చెందిన క్రిష్టిపాటి శ్వేతా కు రూ. 60,000, ఉలిమెళ్ళ గ్రామానికి చెందిన కుంచపు వెంకట శివకు రూ. 52,809, మిద్దె రాధాకు రూ. 7000 మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు ఆయన అందజేశారు. మొత్తం రూ.11.15 లక్షల వచెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం పరిధిలోకి రాని వైద్య సేవలు పొందిన పేదలకు అండగా నిలిచేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థికి ట్రాక్ షూట్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

కబడ్డీ క్రీడాకారిణికి ట్రాక్ షూట్ బహూకరణ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మానస అనే క్రీడాకారిణికి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ట్రాక్ షూట్‌ను బహిష్కరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మానస ఇటీవల జరిగిన విశ్వవిద్యాలయం మహిళ కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపింది. ఈనెల 28,29 తేదిల్లో తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీ కరైపూడి లో జరిగే దక్షిణ భారత దేశ విశ్వవిద్యాలయ మహిళా కబడ్డీ పోటీల్లో యోగివేమన విశ్వవిద్యాలయం తరుపున హజరవుతారని ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఈమేరకు శనివారం ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి కబడ్డీలో ప్రతిభ చూపిన మానసను అభినందించారు. కబడ్డీ ఆటకు సంబంధించిన ట్రాక్ షూట్‌ను బహకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు రాణించడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డ్కెరెక్టర్ తేజేంద్ర, అధ్యాపకులు బాలకొండ గంగాధర్, మాధవ రావు, అరవింద్ పాల్గొన్నారు.

నేడు శివభక్తేంద్రస్వామి 30వ ఆరాధన

ప్రజాశక్తి -ఖాజీపేట : స్థానిక పిడబ్ల్యు బంగ్లా సమీపంలోని శివ భక్తేంద్ర ఆలయంలో స్వామి వారి 30వ ఆరాధన ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలుంటాయన్నారు. కోలాటం, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. **నాలుగో సోమవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం..** కడప - కర్నూల్ జాతీయ రహదారి పూసలకొట్టాలు సమీపంలో అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక చివరి సోమవారం సందర్భంగా హరిహరనాద అయ్యప్ప స్వామి గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షులు పత్తి కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. గ్రామోత్సవ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున తరలిరావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీరాంగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్ : శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి పులివెందుల నియోజకవర్గంలోని బిసి సంక్షేమ వసతి గృహ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. శనివారం పట్టణంలోని రాంగోపాల్ రెడ్డి నివాసంలో ఆయన సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. బిసి సంక్షేమ వసతి గృహాల నిమిత్తం మండలిలో మాట్లాడి రూ. కోటి నిధులు మంజూరు చేయించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపినట్టు బిసి సంక్షేమ వసతి గృహ సిబ్బంది తెలిపారు. అలాగే నిధులు కేటాయించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయులుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి. రామాంజనేయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు జి.ప్రసాద్, ఆర్. గణేష్ బాబు, వెంకట రవీంద్ర, ప్రభాకర్, విక్టర్ పాల్గొన్నారు.

మురుగు కాలువలు ఇలా..

పూడిక తీయకపోతే ఎలా?

ప్రజాశక్తి -ఖాజీపేట

కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళిక నిధులు ద్వారా దళిత కాలనీలలో మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తున్నా ప్రజలకు మాత్రం ప్రయోజనం చేకూరడం లేదు. లక్షలాది రూపాయలు వెచ్చించి మురుగు కాలువలు ఏర్పాట ుచేసినా పూడికి తీత గురించి మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మండల పరిధిలోని కూనవారిపల్లె పంచాయతీ దళితవాడలో సమస్యలు తీష్ట వేశాయి. మురుగు కాలువలలో పెద్ద ఎత్తున వ్యర్థ పదార్థాలు చేరి మురుగు ప్రవాహానికి ఆటంకంగా మారాయి. మురుగు కాలువలకు పైకప్పులు ఏర్పాటు చేయకపోవడంతో గాలుల ఉధృతికి వ్యర్థాలు అన్నీ కాలువలోకి వచ్చి చేరుతున్నాయి. మురుగునీటి ప్రవాహకానికి ఆటంకాలు ఏర్పడడం, దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల స్వైర విహారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. పారిశుధ్యం పై దృష్టి సారించాల్సిన పంచాయతీ అధికారులు తమ కాలనీ గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదనివాపోతున్నారు. మురుగు కాలువలను శుభ్రం చేసి సమస్య లేకుండా చూడాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

వ్యాసరచన పోటీల్లో 'ఉషాకిరణ్' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

బహుమతి అందుకుంటున్న విద్యార్థి స్నేహిత

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉషాకిరణ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న స్నేహిత అనే విద్యార్థి ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచింది. శనివారం స్థానిక ఉషాకిరణ్ పాఠశాలలో సత్య సాయి బాబా జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆంగ్లభాష వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో రాణించిన స్నేహితకు సాయిబాబా సేవా సమితి కన్వీనర్ కె.సాయినాథ్, కన్వీనర్ పి.గోవర్ధన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేయడంతో పాటు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. స్నేహిత మొదటి స్థానంలో రాణించడం పట్ల ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. **శ్రీ చైతన్య విద్యార్థుల విజయం..** సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు కూడ ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. ఇంగ్లీష్, తెలుగులో వ్యాస రచన పోటీలను సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ వ్యాసరచన పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు అంగ్లంలో మొదటి స్థానంలో లిఖిత, రెండవ స్థానంలో దీక్షిత, మూడవ స్థానంలో తనుశ్రీ, తెలుగులో మొదటి స్థానంలో పౌర్ణిమ, రెండవ స్థానంలో మనోజ్ కుమార్, మూడవ స్థానంలో దీక్షిత రెడ్డి బహుమతులు అందుకున్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి చక్రాయపేట : నెరుసుపల్లె పంచాయతీలోని నాగలగట్టుపల్లె - దేవరగట్టపల్లె మధ్యలో వెలిసిన దశరథ మహారాజు ఆలయం వద్ద శనివారం పూజారి లక్ష్మీనారాయణ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. నాలుగేళ్ల నుంచి ప్రతి శనివారమూ దాతల సహకారంతో దశరథ మహారాజు స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం కొనసాగిస్తున్నామని మాజీ సర్పంచ్ సుబ్బరామయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామసుబ్బయ్య, భక్తులు పాల్గొన్నారు.

సిపిఎం మండల కన్వీనర్‌గా రమణ

ప్రజాశక్తి-అట్లూరు

సిపిఎం మండల కన్వీనర్‌గా రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ మండల ప్రథమ మహాసభ సందర్భంగా ఆయన్ను ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్ తెలిపారు. ఆయనతోపాటు కో ఆప్షన్ సభ్యులుగా గంగయ్య, దుర్గమ్మ, ప్రశాంత్, స్వప్న, లత, మండల కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కూరగాయల మార్కెట్‌కు స్థలం కేటాయించేనా?

ప్రస్తుతం వనిపెంట రోడ్డులో అందుబాటులో ఉన్న కూరగాయల దుకాణం

- రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు
- వర్షం పడితే రొచ్చు..రొచ్చే..
- ఇబ్బందుల్లో రైతులు, వ్యాపారులు
- పట్టని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్‌కు స్థల కేటాయింపులు లేకపోవడంతో రైతులు, వ్యాపారులు నానా అవస్థలు పడుతున్నారు. మైదుకూరు మండల పరిధిలో టమోటా, పచ్చిమిర్చి ఇతర కూరగాయలు, ఆకుకూరలు సాగును రైతులు అధికంగా చేపడతారు. వాటి విక్రయించడానికి మైదుకూరు, ప్రొద్దుటూరు తరలిస్తున్నారు. మైదుకూరులోని వనిపెంట రోడ్డులో ప్రస్తుతం మార్కెట్ కొనసాగుతుంది. అయితే మార్కెట్ కు ప్రత్యేక స్థలం కేటాయింపు లేకపోవడంతో రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. అంకాలమ్మ గుడి సమీపంలో అమ్మకాలు రైతులు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో కుళ్లిన కూరగాయలు అధికంగా వేస్తుండటంతో దుర్వాసన వెలువడుతుంది. వర్షం పడినప్పుడు పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంటున్నది. అంతేకాకుండా రోడ్డు వెంబడి దుకాణాలు దూర దూరంగా ఉన్నాయి. కూరగాయల మార్కెట్‌కు ఒక ప్రదేశంలో స్థలం కేటాయిస్తే ఉపయోగంగా ఉంటుంది. గత ప్రభుత్వంలో పశువుల సంతను గగ్గితిప్ప వద్దకు మార్చి పశువుల సంత స్థానంలో కూరగాయల మార్కెట్ గదిలను ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. అయితే అవి పూర్తి కాకపోవడం, నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి సంతను మార్పు చేయడం వంటి పరిస్థితులు నెలకొనడంతో మార్కెట్ స్థల కేటాయింపు ప్రశ్నార్థకంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్‌కు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేసి దుకాణాలను ఏర్పాటు చేస్తే అటు రైతులకు వ్యాపారులకు ప్రజలకు ఉపయోగ కరంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల మార్పులు మైదుకూరులో చేపట్టారు. కూరగాయల మార్కెట్‌కు కూడా స్థలాన్ని కేటాయిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్‌కు, వివిధ గ్రామాలకు వెళ్లే ఆటోలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం లేదు. ప్రజల మీద మాత్రం మున్సిపాలిటీ పన్ను అధికంగా వసూలు చేస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ పరిధిలో అన్ని రకాల వస్తువులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అధ్వానంగా ఉన్న కూరగాయల దుకాణాల పరిసరాలు

నీటి సంఘం ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రమాకుమారి

ప్రజాశక్తి - చాపాడు

త్వరలో నిర్వహించబోయే నీటి సంఘం ఎన్నికలను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. స్థానిక శ్రీ శక్తి భవన్‌లో శనివారం ఎన్నికలకు సంబంధించి పిఒ, ఎపిఒలు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 8న నీటి సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అందుకు సంబంధించి త్వరలో నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. చాపాడు మండల పరిధిలో కేసీ కెనాల్ కాల్వ పరిధిలో 12 టీసీ మెంబర్‌లకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలలో ఎన్నికల రోజున ఉదయం నుంచి అందుబాటులో ఉండి ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కెసి కెనాల్ ఎఇ గురుమోహన్‌రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నిక ప్రక్రియ పూర్తిగా సాధారణ విధానంలో ఉంటుందన్నారు. ప్రతి 2 ఎకరాలకు ఒక టిసి మెంబర్‌ను ఎన్నుకోవాలన్నారు. చాపాడు మండల పరిధిలో 12 టిసిలున్నారని చెప్పారు. 12 మంది టిసి నెంబర్లు ఒక డబ్ల్యూఎను ఎన్నుకుంటారని తెలిపారు. ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవాలు అయితే ఆ సాగునీటి సంఘాలకు ప్రత్యేక నిధులు మంజూరు అవుతాయన్నారు. రైతులు చేతులు ఎత్తి టిసి నెంబర్లను ఎన్నుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు శివ, మహేష్, మండల స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

యాచకురాలికి దుప్పటి కప్పుతున్న ఫౌండేషన్ సభ్యులు

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయం వద్ద ఉన్న నిరాశ్రయులకు, సాధువులకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున అభాగ్యులకు కొంతైనా ఉపశమనం కలిగించేందుకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. దాతల సహకారంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి. శ్రీనివాస రెడ్డి, నరసింహ, విజయ్, టి. వెంకట్ సురేష్, పెద్ది రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రామనాథ్ పాల్గొన్నారు.

'ఎపిజిబి'ని తరలించడం సరికాదు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యంత దగ్గరగా ఆర్థిక సేవలందిస్తున్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని తరలించడం సరికాదని ఎపిజిబి ప్రధాన కార్యాలయ పరిరక్షణ దళం సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఎంఎల్‌ఎ వరదరాజులరెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపిజిబి ఆఫీసర్స్ అసోసియేషన్, ఎంప్లాయీస్ అసోసియేషన్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌రెడ్డి, మహమ్మద్, కె.వి.సుబ్బారెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో ప్రవేశపెట్టిన 'ఒక రాష్ట్రం ఒకే గ్రామీణ బ్యాంక్'పాలసీలో భాగంగా సప్తగిరి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర వికాస్ గ్రామీణ బ్యాంక్‌లను ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లోకి విలీనం చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా నూతనంగా ఏర్పడే రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంక్‌కు ప్రధాన కార్యాలయంగా కడపలో ఉన్న ఎపిజిబి హెడ్‌ఆఫీస్‌ను తరలించాలని యోచిస్తున్నారన్నారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ విధివిధానాల ప్రకారం అధిక లాభాలు కలిగి,బిజినెస్ పరంగా నిల్వల పరంగా పెద్దదైన ఏపిజిబి బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని యథాస్థితిగా కొనసాగించాలని చెప్పారు. కాని కూటమి ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. 'యథారాజ తథా ప్రజ' అన్నట్లు కూటమి నేతల కుతంత్రాలకు అనుగుణంగా బ్యాంక్ అధికారులు ప్రభుత్వ విధివిధానాలను తుంగలో తొక్కి ప్రధాన కార్యాలయాన్ని తరలించే దిశగా అడుగులు వేస్తూ హడావిడిగా ఉన్నారన్నారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయం వెనుకబడిన రాయలసీమలో ఉండడం ఇక్కడి ప్రాంతానికే కాదు దేశానికే గర్వకారణమని చెప్పారు. మన దేశంలోని ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లు అన్నిటికంటే ఎపిజిబి లాభాలు, వ్యాపారం, నిల్వల పరంగా అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ తరలింపు నిర్ణయంతో వెనెకబడిన రాయలసీమ ప్రాంతం మరింతగా అణచివేయబడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలపై రైతులు, చేనేత కార్మికులు బడుగు బలహీన వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధిపై పొదుపు సంఘాల అక్కాచెల్లెమ్మలపై ముఖ్యంగా ఈ ప్రాంత మహిళా సాధికారితపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కూటమి ప్రభుత్వం తరలింపు నిర్ణయాన్ని పునరాలోచన చేసి వెనక్కి తీసుకోవాలని లేదంటే ఎపిజిబి ప్రధాన కార్యాలయ పరిరక్షణ దళం ఆధ్వర్యంలో ఉద్యమరూపం దాలుస్తుందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వరద మాట్లాడుతూ ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిజిబి పెన్షనర్ల అసోసియేషన్ కోశాధికారి గురివిరెడ్డి, సుబ్రహ్మణ్యం యశ్వంత్, రాజేష్, రఫి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న సభ్యులు

ప్రియాంక గెలుపు, జార్ఖండ్ విజయం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

వాయనాడ్ ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీ గెలుపుతో పాటు జార్ఖండ్ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసిరెడ్డి పేర్కొన్నారు. నివారం సాయంత్రం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని వయనాడ్ లోకసభకు జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ భారీ మెజారిటీతో గెలవడం సంతోషకరమని చెప్పారు. ప్రియాంకా గాంధీ గెలుపు భవిష్యత్ భారత రాజకీయాలలో ఒక మలుపు అని చెప్పారు. జార్ఖండ్ అసెంబ్లీకి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తి మోర్చా, ఆర్‌జె లతో కూడిన ఇండియా కూటమి మళ్ళీ అధికారంలోకి రావడంతో పాటు గతం కంటే ఎక్కువ సీట్లు రావడం హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, చెన్నకేశవ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, ఆరు సేర్ల సుబ్బరాయుడు, బద్రి, వెంకటేష్, మాష్, రవి, రమణ, బాలం సుబ్బరాయుడు పాల్గొన్నారు. **కడప :** తొలి అడుగులోనే ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ గెలుపు సాధించడం పట్ల డిసిసి అధ్యక్షులు ఎన్. డి. విజయ జ్యోతి, పిసిసి ప్రధాన కార్యదర్శి పటాన్ మహ్మద్ అలీఖాన్ సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ తొలి అడుగులోనే విజయ ఢంకా మోగించారని పేర్కొన్నారు. ఈ స్థానంలో తన సమీప అభ్యర్థి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి నవ్య హరిదాస్ పై 3.82 లక్షల పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందడం సంతోషకరమన్నారు. వాయనాడ్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపడంపై అక్కడ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ తరఫున కృతజ్ఞతలు చెప్పారు. **జమ్మలమడుగు రూరల్ :** వయనాడులో జరిగిన ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి అఖండ మెజార్టీ సాధించిన ప్రియాంక గాంధీ గెలుపు కాంగ్రెస్ పార్టీ నూతన ఉత్తేజాన్ని నింపిందని ఆ పార్టీ జమ్మలమడుగు సమన్వయకర్త సింగం శివమోహన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ 2029 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగిస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. ప్రధాని మోడీ మాయాజాలాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. 2029లో దేశవ్యాప్తంగా బిజెపికి ప్రజలు స్వస్తి పలకబోతున్నారని జోష్యం చెప్పారు. జిల్లాలో జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థులకు బహుమతి అందిస్తున్న రాజు

వ్యక్తిగత శుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి- పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (అహోబిలపురం మెయిన్)లో సార్డ్స్ (సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ), గ్రామాలయ సంయుక్త ఆధ్వర్యంలో 'డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా' ప్రాజెక్ట్‌లో భాగంగా విద్యార్థులకు హ్యాండ్ వాష్‌పై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ రోజూ భోజనానికి ముందు, టాయిలెట్‌కు తర్వాత సబ్బుతో చేతులు కాళ్ళు శుభ్రం చేసుకోవాలన్నారు. చేతులు శుభ్ర పరిచే ఏడు రకాల విధానాలు తెలియజేశారన్నారు. చిత్రలేఖనంలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిబిఎస్ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణు వర్ధన్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు మొమ్మెల రాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు : మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసే పబ్లిక్ గ్రీవెన్స్‌సెల్‌ను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రమాకుమారి తెలిపారు.శనివారం ఆమె మాట్లాడుతూ రైతుల ప్రజల సమస్యలను మండల స్థాయిలో పరిష్కరించేందుకు పబ్లిక్ గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. మం డల స్థాయి అధికారులు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ప్రజలు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిం చుకోవాలన్నారు.

ఎఐటిఎస్‌కు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ ఎప్లస్ గ్రేడ్ వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి. నారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ వారు ఏగ్రేడ్ ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. విద్యా రంగాలలో ఉన్నత ప్రమాణాలు పాటించినందుకు ఈ గౌరవం దక్కిందన్నారు. ఈ విజయాన్ని సాధించడానికి తోడ్పడిన డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ ఎన్.మల్లిఖార్జున రావు, ఐక్యుఎసి సెల్ కో-ఆర్డినేటర్ కె.అజయ్ కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి ప్రిన్సిపల్ కృతజ్ఞతలు తెలిపారు.

సిద్ధారెడ్డిపల్లి వద్ద నిరుపయోగంగా ఉన్న పాల కేంద్రం

నిరుపయోగంగా పాల సేకరణ భవనాలు

- శిథిలావస్థకు చేరిన వైనం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పలు గ్రామాలలో పాల సేకరణ కేంద్రాలు నిరుపయోగంగా శిథిలావస్థలో ఉన్నాయి. 35 సంవత్సరాల కిందట సిద్ధారెడ్డి ఃపల్లి, నాగులపల్లి, విశ్వనాథపురం, ఓబుల్‌రెడ్డిపేట, చిన్నగురువలూరు, అనంతపురం, అన్నవరం, గ్రామాల్లో సహకార సంఘాలు ఏర్పాటు చేసి దాతల నుంచి స్థలాలను సేకరించి పాలసేకరణ కేంద్రాల్లో నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన పాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రొద్దుటూరు, మైదుకూరు కేంద్రాలకు తరలించేవారు. కాలక్రమేనా ప్రభుత్వ కేంద్రాలు మూతపడటం ప్రయివేట్ పాల కేంద్రాలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ పాల సేకరణ కేంద్రాలు మరుగున పడ్డాయి. దీంతో భవనాలు చాలావరకు దెబ్బతిన్నాయి. సిద్ధారెడ్డిపల్లి గ్రామంలో గత ఐదేళ్ల కిందట పాలసేకరణ భవనానికి మరమ్మతులు చేపట్టి మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. అది రెండు సంవత్సరాలు కొనసాగిన తర్వాత మూతపడింది. ఓబుల్ రెడ్డి పేటలో భవనం ఇప్పటికీ ప్రయివేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో నడుస్తోంది. మిగిలిన గ్రామాల్లో మాత్రం చాలా అధ్వానంగా మరుగునపడ్డాయి. ప్రభుత్వ కార్యాలయాల కోసం వీటికి మరమ్మతులు చేసి వినియోగించుకునే అవకాశం ఉంది. విశ్వనాథపురంలో రోడ్డు విస్తరణలో కొంతభాగం భవనం తొలగించబడినది. పూర్తిగా దెబ్బతిన్న భవనాలను తొలగించి వాటి స్థానంలో ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వం అమూల్ పాల కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం పాల సేకరణకు ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టలేదు. దీంతో పాల కేంద్రాలు దిష్టిబొమ్మల్లా తయారయ్యాయి.

మహారాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి:: కడపవారికోర్టులో

I.A No.677 / 2023

O.S No.1010 / 2023

యేటూరు మనోహర్ రెడ్డి ...పిటిషనర్/వాది

వర్సెస్

1.యేటూరు పాలకొండారెడ్డి & ఇద్దరు ఇతరురు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

పై ఐ.ఎ.లో 1 నుండి 3 రెస్పాండెంట్లు/ ప్రతివాదులకు పత్రికముఖముగా నోటీసులు

To

R1: యేటూరు పాలకొండారెడ్డి, తండ్రి వై.ఈశ్వర్‌రెడ్డి వయస్సు 59 సం॥లు హిందూ, 10/91, బ్రాహ్మణ వీధి, చెన్నూరు పోస్టు & మండలం, కడప జిల్లా. సెల్: 7891130046

R2: శ్రీమతి వినిత, తండ్రి లక్ష్మిశేషారెడ్డి, వయస్సు 25 సం॥లు హిందూ, సెల్: 99512 447501

R3: అనిత, తండ్రి లక్ష్మిశేషారెడ్డి, వయస్సు 25 సం॥లు హిందూ, సెల్: 8639073080

R1 & R3ల నివాహం డోర్ నెం. 9/99, పోస్టు ఆఫీసు దగ్గర, మిట్టావారివీధి, చెన్నూరు పోస్టు & మండలం, కడప జిల్లా.

అనుమీరు ప్రతివాదులుగా పిటిషనర్/వాది మీపై భాగపరిష్కారం కోరుచూ పై దావాదాఖలు చేసియున్నారు. సదరు దావాలో I.A No.677 / 2023 రుగా పిటిషన్ షెడ్యూలు ఆస్థిపై టెంపరరీ ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుచూ, పై ఐ.ఏ. సలుపగా, పై ఐ.ఎలో మీ యొక్క హాజరుకు గాను 16.12.2024వ తేదీన వాయిదా వున్నది. సదరు 16.12.2024వ తేది ఉదయం 10:30 గం॥లకు మీరు రాజశ్రీ కోర్టు నందు హాజరై ఏవైనా ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపుకోనంతట, పై ఐ.ఎ.ని మీ పరోక్షముగా తీర్మానించెదరు.

ఇట్లు
యం.సుధాకర్ బాబ్జీ
వకీలు, కడప

మహారాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి:: కడపవారికోర్టులో

O.S No.1010 / 2023

యేటూరు మనోహర్ రెడ్డి ...వాది

వర్సెస్

1.యేటూరు పాలకొండారెడ్డి & ఇద్దరు ఇతరురు ...ప్రతివాదులు

పై దావాలో 1 నుండి 3 ప్రతివాదులకు పత్రికా ముఖముగా సమనులు

To

R1: యేటూరు పాలకొండారెడ్డి, తండ్రి వై.ఈశ్వర్‌రెడ్డి వయస్సు 59 సం॥లు హిందూ, 10/91, బ్రాహ్మణ వీధి, చెన్నూరు పోస్టు & మండలం, కడప జిల్లా. సెల్: 7891130046

R2: శ్రీమతి వినిత, తండ్రి లక్ష్మిశేషారెడ్డి, వయస్సు 25 సం॥లు హిందూ, సెల్: 99512 447501

R3: అనిత, తండ్రి లక్ష్మిశేషారెడ్డి, వయస్సు 25 సం॥లు హిందూ, సెల్: 8639073080

R1 & R3ల నివాహం డోర్ నెం. 9/99, పోస్టు ఆఫీసు దగ్గర, మిట్టావారివీధి, చెన్నూరు పోస్టు & మండలం, కడప జిల్లా.

అనుమీరు ప్రతివాదులుగా వాది మీపై భాగపరిష్కారం కోరుచూ మీ దావాను సలుపగా, సదరు దావా మీ యొక్క హాజరుకు గాను 16.12.2024వ తేదీకి వాయిదావున్నది. కావున సదరు 16.12.2024వ తేది ఉదయం 10:30 గం॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై మీకు ఏవైనా ఆక్షేపణలు/అభ్యంతరములు ఉన్న యెడల కోర్టువారికి తెలుపుకొనవలెయును. లేనియెడల పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు

ఇట్లు
యం.సుధాకర్ బాబ్జీ
వకీలు, కడప